అయిదింటికి ఆఫీసు ఖాళీ అయింది. ఇంటి పక్షులు యిళ్ళకెగిరి పోయారు. బ్రహ్మచారులూ, తాత్కాలిక బ్రహ్మచారులు కొంతమందీ యిళ్ళకెళ్ళి చేసేదేమీ లేక పేకాటా, కారంస్ ఆడటానికి స్పోర్ట్స్‌రూంకు చేరుకున్నారు. నెత్తి నెత్తుకున్న పెంట తీసేసుకోలేక నేనూ, మరో పదిమందిమీ నెమ్మదిగా. అయిష్టంగా యూనియన్ రూంకు నడిచాం.

అప్పటికే రూంలో సెక్రటరీ, కమిటీమెంబర్లు సమావేశం ప్రారంభించారు. పేరుకే కమిటీ మీటింగ్ కాని అక్కడా కబుర్లే. ఎవడి గోల వాడిదే. ప్రతివాడూ పక్కవాడితో ఏదో ప్రపంచ సమస్య (ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం, పంజాబు, తెలుగుగంగ, సింహళంలో తమిళుల వధ వగైరా) గొంతు చించుకుని వాదిస్తూనే వున్నాడు.

"మీ చర్చలు తరువాతయ్యా బాబూ. మనం కాసేపు వచ్చిన పనేమిటో మాట్లాడుకుందామా?" అన్నాడు సెక్రటరీ.

"చెప్పండి."

సెక్రటరీ గొంతు విప్పగానే మళ్ళీ వీళ్ళ చర్చలు మొదలు.

(నాతోసహా) అందరూ మంచివాళ్ళే. సెక్రటరీ మీద ఎనలేని నమ్మకం. సెక్రటరీగారు అనర్గళంగా మాట్లాడి చివరికి యిష్టంలేని విషయం కూడా మాచేత ఒప్పిస్తాడని మాకు తెలుసు.



"మన డిమాండ్లను మేనేజిమెంటు ఒప్పుకునేట్టు లేదు. 'చర్చలు చర్చలు' అంటూ కాలయాపన చెయ్యటమే వాళ్ళ ఎత్తుగడలా తోస్తున్నది. ఇంక మనం ఏదో ఒక ఆందోళన కార్యక్రమం ప్రారంభించకపోతే లాభం లేదు." అన్నాడు సెక్రటరీ.

వెంటనే, 'అలాగే' అంటూ అయిదుగురం కోరస్ పాడాం.

"ఏం చెయ్యాలని మీ ఉద్దేశం?" అన్నాడు ఈశ్వర్.

"ఏముందీ, డిమాన్‌స్ట్రేషన్స్ - ప్రదర్శనల్తో ప్రారంభిద్దాం" అన్నాడు సెక్రటరీ.

"హహ్హహ్హా. మేనేజిమెంటు పెద్ద పెట్టుబడిదారు. ఈ తాటాకు చప్పుళ్ళకు జడపరు" అన్నాడు ఈశ్వర్. అందరం అతడివైపు చూశాం. ఈశ్వర్ మాలోని వాడే. కాని కాస్త అతివాది. అతడి కంటికి మేమంతా రియాక్షనరీలలాగా, రివిజనిస్టులలాగా కనిపిస్తాం. దమ్ములేనివాడు దమ్ములేవని ఒప్పుకోటానికి సిగ్గుపడ వలసిన అవసరం లేదు. మా ఫ్రెండ్సు కాస్త ఆర్గ్యూ చేస్తారుగాని నేను వెంటనే 'అవును గురూ, నేను చవటనే' అని ఒప్పేసుకుంటాను. బతికుంటే బలుసాకు తినొచ్చనుకునేవాణ్ణి నేను.

"అసలు ప్రపంచ చరిత్రలో కార్మిక సంఘాలు ఎప్పుడు ఏ పరిస్థితుల్లో పుట్టాయో జ్ఞాపకం చేసుకుంటే మనం ఎప్పారం ఈ పాక్షిక ఆర్థిక పోరాటాలతో తృప్తిపడం" అంటూ ఓ బాంబ్‌షెల్ వేశాడు ఈశ్వర్. దళసరి కళ్ళద్దాలు, చింపిరిజుత్తు, చేతిలో ఎప్పుడూ సిగరెట్టు. చంకలో ఓ అరడజను పుస్తకాలు, పత్రికలు-సృజన, అరుణతార. ఫ్రాంటియర్. మాస్‌లైన్ వగైరా ఎవో అన్నీ అలాంటివే. అతడెక్కడ తిరిగితే అక్కడే ప్రభుత్వం డిస్టర్బ్‌డ్ ఏరియాగా ప్రకటిస్తుందేమోనన్నంత భయంకరంగా మాట్లాడుతాడు. (మాటవరసకన్నాను. మనిషి మంచివాడులెండి.)

"నీ విప్లవ బాధకాదు గురూ, మనం చెయ్యాల్సింది చెప్పు." అన్నాడు సర్వారావు. వాడసలే పిరిగ్గొడ్డు. ఈశ్వర్‌ను చూస్తే నాకప్పుడప్పుడూ ఓ అనుమానం వస్తుంటుంది. ఈ మార్క్సిస్టు-లెనినిస్టు విప్లవ పార్టీలు తమ సభ్యుల్ని కొంతమందిని కార్మిక సంఘాల్లో పనిచేసి వాటిని మరింత రాడికలైజ్ చెయ్యమని పంపిస్తుంటాయట. వీళ్ళు వాళ్ళ తరపు గూఢచారుల్లా ఇక్కడ పని చేస్తుంటారు. ఒకవేళ ఈశ్వర్ అలాంటివాడైనా నేను ఆశ్చర్యపడను. ప్రతిరోజూ పేపరు తెరవగానే 'ఈశ్వర్ అరెస్టు' అనే మాట కనిపిస్తుందేమోనని ఆత్రుతగా చూస్తాను. లేదా ఈశ్వర్ సెలవుపెట్టి మాయమైపోతే (అతడు తరచుగా సెలవు పెడుతుంటాడు.) ఏ వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ అడవుల్లోనో ఎన్‌కౌంటర్లో చంపేశారేమోనని భయపడతాను. ఎంత చెడ్డా కొలీగ్; మిత్రుడు.

"కామ్రేడ్ ఈశ్వర్ చెప్పినదానివెనక చాలా చరిత్ర వుంది. కార్మికోద్యమ చరిత్ర చదువుకోకుండానే మనమంతా కార్మిక సంఘంలో పోస్టుల్లో వున్నామంటే ఒకరకంగా సిగ్గుపడాలి. నిజానికి మనం ఎప్పుడైనా మన సభ్యుల కోసం 'పాఠశాల' నిర్వహిస్తే ఈశ్వర్‌ని తప్పక అక్కడ లెక్చర్లివ్వమని మనం కోరాలి. కాని ప్రస్తుతం—" అంటూ ప్రారంభించాడు సెక్రటరీ.

కార్మిక సంఘమంటే విప్లవ పార్టీయా ఏమిటి? యూనియన్ అంటూ ఒకటుంటే మేనేజిమెంటు మరీ బరితెగించి పోకుండా చూడచ్చనీ, పని పరిస్థితులు మెరుగుపడతాయనీ, ఏదో కాస్త హడావిడి చేసి జీతం రాళ్ళు పెరుగుదల కోసం ప్రయత్నించవచ్చనీ అనుకున్నామేగాని-విప్లవమే రావాలి, దేశంలో కమ్యూనిజమే రావాలి. అప్పుడే మా బతుకులు కడతేరాలి అంటే అది మావల్ల అయ్యే పనేనా!

ఈశ్వర్ కంత ఉత్సాహంగా వుంటే ఆ పార్టీలోనే ఫుల్‌టైమర్‌గా పని చేస్తే పోదూ. కార్మికసంఘం ఏం చెయ్యాలన్నా అందర్నీ కూడగట్టుకుని ముందుకదలాలి. ఏదో ఎర్రజెండా మీద కార్మిక సంఘం పేరు రాసుకోవటం, అందరం

ఒకర్నొకరు క్లామేడ్ అని పిలుచుకోవడం తప్పిస్తే మేమెవరమూ కమ్యూనిస్టులం కామే!

అసలు ఈ ప్రదర్శనలకైనా ఎంతమంది వస్తారో అనుమానమే. కాని ఈశ్వర్ మాట తీసెయ్యటానికి లేదు. అతడు చెప్పిందాంట్లోనూ సత్యమున్నది.

"క్లామేడ్ ఈశ్వర్ అభిప్రాయాన్ని మార్గదర్శకంగా తీసుకుని మనం మొదట ఆఫీసుకు గంట లేటుగా అటెండయ్యే కార్యక్రమం ప్రారంభిద్దాం." అన్నాడు సెక్రటరీ.

ఈశ్వర్ చిర్రాగ్గా చూశాడు.

"మీరేపని చేసినా అందరికోసం చేస్తారుగాని నా ఒక్కడికోసం కాదు. ఆ లెక్కన ఇప్పుడు మనకు వస్తున్న జీతం కూడా మనకన్నా ఎక్కువ కష్టపడుతున్న అనేకమంది ఇతర కార్మికులకు వస్తున్న జీతంకన్నా ఎక్కువే. నిజానికి, ప్రస్తుతం దేశంలో వున్న నిరుద్యోగ సమస్యతో - మనకిస్తున్నదాంట్లో సగం ఇస్తామన్నా ఎగిరి గంతేసి వచ్చేవాళ్ళు లక్షలమంది వున్నారు. అందువల్ల మనం మేనేజిమెంటు మెడలు వంచి జీతాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించాలనుకుంటే కనీసం ఒకరోజు సమ్మెతో ప్రారంభించాలి." అన్నాడు.

సెక్రటరీ ఈ కొడతాడేమోనని మాకు గుండెల్లో రైళ్ళు పరుగెత్తాయి. కాని ఎప్పుడూ పాము చావకుండా, కర్ర విరక్కుండా మాట్లాడే సెక్రటరీ మావైపు చూశాడు.

"అన్నప్రాశన చెయ్యకుండానే మాంసం తినమన్నట్టుగా యిదేమిటయ్యా?" అన్నాడు చౌదరి.

ఈశ్వర్ లేవదీసిన పాయింటుమీద తర్జన భర్జన ప్రారంభమైంది. కాని ముందే నిర్ణయించుకున్న పని వుండటంతో నేను వెడతానని లేచాడు. పౌర హక్కుల సంఘం సమావేశానికి వెళ్ళాలని ఈశ్వర్ కూడా బయల్దేరాడు.

"ఎందుకు ఈశ్వర్, మమ్మల్ని అలా అడకత్తెరలో ఇరికించ చూస్తావు?" అన్నాను.

"లేకపోతే ఏమిటి ఆడంగి కబుర్లూ. మనిషి తనకై తాను ఏ ప్రమాదాన్నీ ఎదుర్కోవటానికి ఇష్టపడడు. తన మంచి కోసమే అయినాసరే, రిస్కు మాత్రం వద్దంటాడు. అందువల్ల మనం వాళ్ళను ముందుకు నెట్టాలి. ఒక్కరోజుతో ఈ సమస్య పరిష్కారం కాదని నాకు తెలుసు. అప్పుడు సమ్మె రెండోరోజు కూడా సాగుతుంది. క్రమంగా అటు మేనేజిమెంటు మీదా, యిటు మనమీద కూడా వొత్తిడి పెరుగుతుంది. మన పోరాటం తీవ్రతరమవుతుంది. పోలరైజేషన్ ఇలాగే వస్తుంది." అన్నాడు ఈశ్వర్.

"చివరికి?"

"ఏముందీ, ఎవరో ఒకరు గెలుస్తారు. మేనేజిమెంటు గెలిస్తే అది మనకు మంచి గుణపాఠం. ఇటువంటి పోరాటాలు ఎంత నిర్వీర్యమైనవో తెలిసివస్తుంది. ఒక కార్మిక సంఘం కాదు—ఇతర కార్మిక సంఘాలు—మొత్తం కార్మికవర్గం కలిసి సంఘటితంగా యుద్ధం ప్రకటించాలన్న చారిత్రక సత్యం అవగాహనవుతుంది. అప్పుడు దేశంలో నడుస్తున్న ఇతర ప్రజాపోరాటాలతో ఐక్యసంఘటన ఏర్పడుతుంది." అన్నాడు ఈశ్వర్.

"అయ్యబాబోయ్. నాలుగు జీతంరాళ్ళు కావాలంటే ఎంత థీరీ చెప్పావు!" అన్నాను ఇతగాడి ప్లానుకు ఇంకేమనాలో తోచక.

"సిద్ధాంతం కాదు. ఇది ఆచరణ."

"కడుపులోని చల్ల కదలకుండా వున్న మనవాళ్లు నీ సిద్ధాంతాన్ని అంగీకరించకపోతే ఏం చేస్తావు?" అన్నాను.

"అటువంటి కార్మిక సంఘంతో నాకు సంబంధం లేదు-" అన్నాడు ఈశ్వర్.

# వాలుకుర్చీ
## యం. పార్థసారథి

"నువ్వు ఆందోళన కార్యక్రమంలో పాల్గొనవా మరి?"

"ఎందుకు? ఆడాళ్ళంతా కలిసి బతుకమ్మఆట ఆడుకున్నట్టు ఆఫీసు ముందర చేరి భజన చెయ్యటానికా?"

"ఆఫీసులో ఉద్యోగివైన నువ్వు అందరితోపాటు పాల్గొనకపోతే దానివల్ల ఎవరికి లాభం? - ఉద్యోగులకా? మేనేజిమెంటుకా?

"మేనేజిమెంటుకు లాభమని మీరనుకుంటున్నారు. నన్ను 'ద్రోహి' అంటారు. కాని వుద్యమానికి లాభమని నేను నమ్ముతాను." అన్నాడు ఈశ్వర్.

ప్రెస్ క్లబ్‌లో మీటింగ్, రజనీకొఠారీ, కన్నాభిరాన్ వగైరా ప్రముఖులు అనేకమంది వచ్చారు. ఈశ్వర్‌ను చూసి అక్కడ అనేకమంది పలకరించారు. వాళ్ళ మధ్యన నాకు కాస్త యిరకాటంగానే తోచింది. బయట వరండాలో పెట్టిన వుస్తక ప్రదర్శనను చూస్తూ నిల్చున్నాను. అక్కడికి వచ్చినవాళ్ళు విప్లవకారులో, విప్లవాభిమానులో, ప్రజాస్వామ్యవాదులో నాకు తెలియదు. వాళ్ళ మాటల ధోరణి చూస్తే ఈశ్వర్ గట్టివాడనే తోచింది. అసలలాంటి చోటికి వచ్చినందుకే పోలీసులు నిఘా వేస్తారేమోనని నా అనుమానం. మఫ్టీలో మా చుట్టూ ఎంతమంది గూఢచారులున్నారో ఏం తెలుసు. ఈశ్వర్ మాత్రం చక్కగా ఎగ్జిబిషన్‌లో తిరిగినట్టుగా, కరచాలనాలు చేస్తూ 'వాళ్ళ' కబుర్లు చెప్పుకొంటూ తిరిగాడు. పోలీసు అత్యాచారాల గురించీ, ఎన్‌కౌంటర్ల పేరుతో అమాయకులను, ప్రజా కార్యకర్తలను పట్టుకుని చిత్రహింసలు పెట్టి కాల్చివేస్తున్నారని చెప్పారు. 'పట్టుకుని కాల్చి ఎన్‌కౌంటర్ పేరు పెడుతున్నారంటే అది అన్యాయమనటానికి సందేహమెందుకు?

'ప్రభుత్వ చట్టాలను పోలీసులే ఉల్లంఘిస్తున్నారు' అన్నాడు మరో వక్త. "ఈ పరిస్థితుల్లో అధికారమే నేరమై ప్రజల్ని నేరస్తుల్ని చేస్తుంటే నోరుండి వూరుకున్న ప్రతివాడూ నేరస్థుడే-" అన్నాడు. ఆ మాటకు వాళ్లు గగుర్పొడిచింది. నా బానిస బతుకుమీద సిగ్గుపడ్డాను. "అద్భుతం గురూ" అన్నాను.

ఈశ్వర్ నవ్వాడు.

"ఇంత సానుభూతి వున్నవాడివి తరచు యిలాంటి సమావేశాలకెందుకు రావు మరి?" అన్నాడు.

"ఇకమీదట వస్తాను" అన్నాను.

యాదృచ్ఛికంగా యిలా రావటంవల్ల నా కళ్ళు తెరుచుకున్నాయి. జ్ఞానోదయమైంది. దేశంలో యింత అల్లకల్లోలం వుందా! ఇంత అన్యాయం, అక్రమం, హింస...

"నేను మన మీటింగ్‌లో అలా ఎందుకు మాట్లాడానో యిప్పుడైనా అర్థం చేసుకున్నావా?" అన్నాడు ఈశ్వర్.

ఇక్కడి వక్తలు దేశ పరిస్థితిని వర్ణించిన తర్వాత అలాంటి చిన్న విషయాలను గురించి ఆలోచించటానికే మనస్కరించలేదు. పీత కష్టాలు పీతవి కావచ్చు కాని దానికీ, దీనికీ సారూప్యం ఏమిటి?

నేను మాట్లాడలేదు.

# వేయి స్తంభాల గుడి

## శ్రీ రెంటాల శ్రీవెంకటేశ్వరరావు

(వేయి స్తంభాల గుడిని దర్శించినప్పుడు - విశ్వనాథ వారైతే దీన్ని గురించి ఏం రాసేవారో అన్న ఆలోచన పుట్టి - రాసిన పద్యాలివి.)

ఇచటి నందీశ్వరుం డేపురాతన జయ
 స్వప్న సంచయ దిదృక్షార్త మతియొ
ఇచటి కూలిన స్తంభ నిచయమే మతమదో
 న్మత్తదౌర్జన్య చిహ్నాత కులదియొ
ఇచటి కోనేటి నీరే నాటి దిక్కులే,
 నట్టి తెన్గుల విషాదాశ్రుమయమొ
ఇచటి రుద్రేశ్వరుండెన్ని కష్టసుఖాల
 కడలుల జనుల చుక్కాని యగునొ

ఇచటి ఒకనాటి వైభవ మ్మెంత ఘనమొ
ఇచటి ఒకనాటి వైక్లబ్య మెంత భృశమొ
పద పదాస్పృష్ట ప్రాక్కథా ప్రథితమైన
ఆలయమ్మిది; ముందున కడుగు పడదు.

ఒక్కొక్క తెన్గువాడుక్కు మగటిమి ప్ర
 తాపరుద్రత గన్న ధన్య ఘడియ
ఒక్కొక్క పదుచు నాంధ్రోగ్రధీ సద్గ్రంథ
 మునకు శాశ్వత నొప్పు పుణ్యఘడియ
ఒక్కొక్క సౌధమ్ము చిక్కణ శ్రీకిన
 త్రన మందిరత దాల్చు రమ్యఘడియ
ఒక్కొక్క శిలయు సముజ్జ్వల జీవశి
 ల్పరుచి నాంధ్రత గొన్న లలిత ఘడియ

కలసి వచ్చిన కాలానా వెలసి; నేటి
కా మహాకాల హేలా నిరంతరాయ
దర్శనాకాంక్ష దప్తమై తపసివోలె
కొలుచు రుద్రేశు శీర్ణ దేవాలయమ్ము.

"ఏం చెప్పవేం?" అన్నాడు ఈశ్వర్.

ఇంతలో నన్ను రక్షించటానికన్నట్టుగా, చెదరిన జుత్తుతో, సాదా కాటన్ చీర చుట్టుకుని, ఫాషన్‌ను యిష్టపూర్వకంగా తిరస్కరిస్తున్నట్టుగా వున్న ఓ పాతికేళ్ళ స్త్రీ 'నమస్కారం ఈశ్వర్‌గారూ' అంటూ వచ్చింది.

ఈశ్వర్ నన్నామెకు పరిచయం చేశాడు.

"మీరిటువైపు తరచుగా రావటం లేదు." అంది ఆవిడ.

"ఏవో ఆఫీసు గొడవలు" అన్నాడు ఈశ్వర్.

ఆవిడ చేతిలో పట్టుకున్న కాగితాల బొత్తిలోంచి రెండు కాగితాలు తీసి నాకొకటీ; ఈశ్వర్ కొకటీ యిచ్చింది.

"ఎన్‌కౌంటర్లన్నీ పోలీసు హత్యలే. ఈ అక్రమాల్ని ఆపమని ప్రభుత్వానికి మెమోరాండం సమర్పించాలి. సంతకాల ఉద్యమం ప్రారంభించాం..." అంది ఆవిడ బాల్ పెన్ను అందిస్తూ.

"మేమంతా ఎప్పుడూ మీతోనే గదా!" అన్నాడు ఈశ్వర్.

ఇంత గొప్ప కర్తవ్యం నిర్వహించే అవకాశం కల్గిన సంతోషంతో నేను పెన్ను తీసుకుని గబగబా పేరు రాసి సంతకం చేశాను.

"నేను తరువాత సంతకం చేసి మీకిస్తానులెండి." అంటూ ఈశ్వర్ కాగితం మడిచి జేబులో పెట్టుకున్నాడు.

ఆవిడ బలవంతం చెయ్యక నమస్కారం చేసి వెళ్ళిపోయింది.

ఒకసారి నిట్టూర్చి, నావైపు విసుగ్గా చూసి మెట్లు దిగాడు ఈశ్వర్.

"ఏమిటి కామ్రేడ్, సంతకం చెయ్యలేదేం? అభిప్రాయభేదమేమైనా వుందా? అని అడిగాను.

"నీకు బుద్ధిలేదసలు. ఇలాంటివి చెయ్యటం మన ఆఫీస్ రూల్సుకు విరుద్ధం తెలుసా!" అన్నాడు ఈశ్వర్ నన్ను చిరాగ్గా ఫూల్‌ని చూసినట్టుగా చూసి.

"అదేమిటి, అన్యాయం ఆపమని చెప్పటానికి రూల్సెందుకు అడ్డమొస్తాయి?" అన్నాను అర్థంకాక.

"చూడవోయ్, వెర్రినాయనా, ఇవన్నీ తీవ్రవాద రాజకీయాలు. మనం, సంతకాలు, దస్తూరి లేకుండా ఎన్ని మీటింగులకి వచ్చినా ఫరవాలేదు. కాని సంతకాలు చెయ్యటమంటే పోలీసు పుస్తకాల్లోకి ఎక్కినట్టే." అన్నాడు ఈశ్వర్.

"ఎక్కితే ఏమిటి? నేనేం తప్పు చేశాను?" అన్నాను.

"నీ ఖర్మ నీలాంటి బడుద్ధాయిలకు ఎంత చెప్పినా అర్థం కాదు." అంటూ మరో సిగరెట్టు వెలిగించి బస్సెక్కి వెళ్ళిపోయాడు ఈశ్వర్. ●